ధాన్యం.. దైన్యం

• కేంద్రాల్లో ధాన్యం పట్టింపులేని అధికార గణం • దళారుల పరమవుతున్న వడ్లు • పడిగాపులు పడుతున్న అన్నదాతలు

ముస్తాబాద్‌: వరి కోతలు షురూ అయి నెలరోజులవుతోంది. జిల్లాలోనే మొదటగా ముస్తాబాద్‌ మండలంలో వరి కోతలు ప్రారంభమవుతాయి. ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ ధాన్యాన్ని తరలించి పది రోజులవుతోంది. అయినా ఐకేపీ, సహకార సంఘాల కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో స్పష్టత లేదు. ఒకవైపు ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, మరోవైపు ధాన్యం సేకరణ ఎలా చేస్తారనే ఆందోళన రైతుల్లో నెలకొంది. ముస్తాబాద్‌ మండలంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ఐదు, సహకార సంఘాల కేంద్రాలు 16 ఉన్నాయి. ఈ వానకాలం పుష్కలంగా పంట దిగుబడి రాగా రైతులు తమ ధాన్యాన్ని విక్రయించేందుకు పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు తరలించారు.


నామాపూర్‌ కేంద్రంలో ధాన్యం

కేంద్రాల ప్రారంభం ఆలస్యం

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఆ విధుల్లోనే ఉన్నారు. వానకాలం పంటల ధాన్యం సేకరణకు కావాల్సిన ఏర్పాట్లను ఇప్పటికీ పూర్తిచేయలేదని తెలుస్తోంది. గన్నీ సంచులు, సుతిలీ, టార్పాలిన్లు, మాశ్చర్‌, జాలీ మిషన్లు ఇంకా కేంద్రాలకు చేరలేదు. ఐకేపీ అధికారులు ఎన్నికల విధులకు వెళ్తుండగా, జిల్లా అధికారులు సైతం అదే బీజీలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ వానకాలం పంటల సేకరణ ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు క్షేత్రస్థాయి సిబ్బందితో జిల్లా అధికారులు ఎలాంటి ముందస్తు సమావేశాలు నిర్వహించలేదు. అలాగే ఏఎంసీ అధికారులు కూడా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. సిబ్బందితో ముందస్తు సమావేశాలు, కేంద్రాల నిర్వహణకు కావాల్సిన చర్యలు ఇప్పటి వరకు తీసుకోలేదు.

కొనుగోళ్లు ఆలస్యం.. మిల్లర్లకు వరం

ముస్తాబాద్‌ మండలంలో ధాన్యం కేంద్రాలను అధికారులు ప్రారంభించకపోవడంతో ఇదే అదనుగా వ్యాపారులు, మిల్లర్లు రంగంలోకి దిగారు. మిల్లర్లు క్వింటాలు ధాన్యానికి రూ.1,800 వరకు పెడుతుండగా, వ్యాపారులు రూ.1,700 మాత్రమే ఇస్తున్నారు. ఇప్పటికే గూడెం, ఆవునూర్‌, కొండాపూర్‌, రామలక్ష్మణపల్లె, తుర్కపల్లి గ్రామాల్లో యాభై శాతం ధాన్యం వ్యాపారులు కొనుగోలు చేశారు. తేమ, పెల్ల వంటి నిబంధనలు లేకుండా వ్యాపారులు, మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2,200 వరకు ఉంది. రైతులు కొంతమేరకు నష్టపోతున్నా, ఎలాంటి రిస్క్‌ లేకుండా వ్యాపారులకు ధాన్యం విక్రయించడమే నయం అంటున్నారు.


కొండాపూర్‌లో వ్యాపారులు తరలిస్తున్న ధాన్యం

రోజుల తరబడి పడిగాపులు

రైతులు భారీగా వచ్చిన దిగుబడులను కొనుగోలు కేంద్రాలకు తరలించారు. ముస్తాబాద్‌, నామాపూర్‌, గూడెం, ఆవునూర్‌, పోతుగల్‌, తెర్లుమద్ది, చీకోడు తదితర గ్రామాల్లోనే కేంద్రాలకు ధాన్యాన్ని తరలించారు. కొన్ని కేంద్రాల్లో పక్షం రోజులుగా ధాన్యం ఆరబెట్టడం, తిరిగి కవర్లు కప్పడం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర కోసం రోజుల తరబడి పడిగాపులు పడుతున్నామని తెలిపారు. ఎన్నికలతో సంబంధం లేకుండా కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. ధాన్యం కుప్పల వద్ద రోజుల తరబడి కావలి ఉంటున్నామన్నారు. గత సీజన్‌లో అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయామని ఈసారైన ధాన్యం కొనుగోళ్లు సవ్యంగా సాగేలా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పది రోజులుగా ఎదురుచూస్తున్న



నామాపూర్‌ కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చి పది రోజులైంది. ఇక్కడ ఎవరు జవాబు చెప్పే వారు లేరు. మద్దతు ధర ఎంత ఇస్తారో కూడా చెప్పేవారు లేరు. రోజు ఎండకు వడ్లు ఆరబెడుతున్నం.. రాత్రి కవర్లు కప్పుతున్నం. కేంద్రాలను ప్రారంభించి, రైతుల కష్టాలను తీర్చాలి.

– తలారి ఎల్లం, రైతు, నామాపూర్‌

ఐదెకరాల ధాన్యం తీసుకువచ్చిన



ఐదెకరాల్లో ధాన్యం పండించాం. వారం రోజులుగా ఎదురుచూస్తున్నాం. వడ్లు ఇక్కడి తెచ్చినం. వడ్లు ఎండకు పోస్తున్నాం. టార్పాలిన్లు ఇస్తే బాగుండు. చెడగొట్టు వానలు వస్తే రైతులు దిక్కులేని వారవుతారు. కేంద్రంలో వడ్లు తీసుకునుడు ఆలస్యమైతే కనీసం వసతులైనా కల్పించాలి.

– ఇగుదుర్శాళ్ల వరలక్ష్మి, రైతు, గూడెం

త్వరలోనే ప్రారంభిస్తాం



మేము ఎన్నికల విధుల్లో ఉన్నాం. త్వరలోనే కేంద్రాలను ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. ఇంకా మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. రైతులకు మద్దతు ధర అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఎవరూ ఆందోళన చెందవద్దు. పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం.

– దేవరాజు, ఏపీఎం, ఐకేపీ, ముస్తాబాద్‌

క్లుప్తంగా

బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

రుద్రంగి: మండల కేంద్రంలో గురువారం జరిగే బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బతుకమ్మ వేడుకులకు హాజరయ్యే రుద్రంగి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రుద్రంగి సర్పంచ్‌ తర్రె ప్రభలత ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. రుద్రంగి కార్యదర్శి రాందాస్‌, నాయకులు తర్రె మనోహర్‌ పనులు పర్యవేక్షించారు.

పూలే ఆశయాలను కొనసాగించాలి


దేవానంద్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

ముస్తాబాద్‌: సామాజిక విప్లవకారుడు జ్యోతిబా పూలే ఆశయాలను నేటి తరానికి అందించాలని ప్రముఖ వ్యాపారవేత్త నాగెల్లి దేవానంద్‌ అన్నారు. కోండాపూర్‌లో పూలే దంపతుల విగ్రహాలకు సహకరించిన దేవానంద్‌ను ముదిరాజ్‌ సంఘం సభ్యులు బుధవారం ఘనంగా సత్కరించారు. భావితరాలకు పూలే గొప్పతనానికి వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్య అవశ్యకతను తెలియజేయాలన్నారు. విగ్రహాల నిర్మాణానికి సాయం చేసిన దేవానంద్‌కు సంఘం సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు చిగురు వెంకన్న, దేవేందర్‌, నర్సయ్య, రాజం, పెద్ద నర్సయ్య, యాదయ్య, వెంకటి, కాశయ్య, నరేశ్‌, ప్రశాంత్‌, గంగరాజు, ఈశ్వర్‌, నవాబు, కిషన్‌, శంకర్‌ పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

సిరిసిల్లక్రైం: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అఖిల్‌ మహాజన్‌ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్‌ హాల్‌ ఉదయం 9 గంటలకు 100 మందితో రక్తదాన శిబిరం ఉంటుందన్నారు. అత్యవసర సమయంలో రక్తదానం ప్రాణదానమని ఇలాంటి మహోన్నత కార్యక్రమానికి రక్తదాతలు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని ఎస్పీ కోరారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

చందుర్తి: రక్తదానం చేసేందుకు ఆసక్తిగల యువకులు తమ పేర్లను ముందే నమోదు చేసుకోవాలని చందుర్తి ఎస్సై సిరిసిల్ల అశోక్‌ కోరారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పోలీసుల అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ అఖిల్‌ మహాజన్‌ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌ కార్వర్స్‌లో గురువారం నిర్వహిస్తున్నారని, ఎస్సై అశోక్‌ (87126 56420), కానిస్టేబుల్‌ మనోహర్‌ (93471 75757) నెంబర్లకు ఫోన్‌ చేసి పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. రక్తదానం చేసే వారి పూర్తి వివరాలు తెలిపితే సిరిసిల్లకు తరలించేందుకు వాహనాలను సమకూర్చనున్నట్లు వివరించారు.

నియామకం

కాంగ్రెస్‌ మండల కార్యదర్శిగా సురేందర్‌


సురేందర్‌కు స్వీట్‌ తినిపిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండల కాంగ్రెస్‌ పార్టీ కార్యదర్శిగా ఉడుగుల సురేందర్‌ను నియమించినట్లు బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పి లుపునిచ్చారు. కాంగ్రెస్‌ మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీలను ఇంటింటికి చేర్చాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌, నాయకులు రఫీక్‌, రాజునాయక్‌, భూపాల్‌రెడ్డి, నర్సింలు, దేవరాజు, సంతోష్‌గౌడ్‌, ఇమామ్‌ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత


ఆర్థికసాయం అందిస్తున్న వికాస్‌–దీప

కోనరావుపేట: మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పల్లం లక్ష్మణ్‌ కుటుంబాన్ని డాక్టర్‌ చెన్నమనేని వికాస్‌రావు–దీప దంపతులు బుధవారం పరామర్శించారు. పల్లం లక్ష్మణ్‌ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వికాస్‌రావు దంపతులు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. అలాగే లక్ష్మణ్‌ భార్య కవితకు ప్రతిమ ఆస్పత్రిలో ఉద్యోగావకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కోనరావుపేట మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గోపాడి సురేందర్‌రావు, గొట్టె రామచంద్రం, బాలాజీ, భాస్కర్‌, ఎగ్గె మల్లేశం, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

సొమ్మసిల్లి పడిపోయిన భక్తురాలు


పడిపోయిన భక్తురాలికి ప్రథమ చికిత్స చేస్తున్న బంధువులు

వేములవాడ: రాజన్నను దర్శించుకునేందుకు వచ్చిన ఓ భక్తురాలు బుధవారం సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు ఆలయంలో నుంచి అభిషేక మండపం వద్దకు తీసుకొచ్చి ప్రథమ చికిత్స అందించారు. కాసేపటికి ఆమె స్పృహలోకి వచ్చింది. ఆలయంలో భక్తులకు ఏదైనా ప్రమాదం జరిగితే కనీసం ప్రథమ చికిత్స అందుబాటులో లేకుండా పోయిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ అధికారులు ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

దుర్గాదేవి నిమజ్జనం


నారాయణపూర్‌లో దుర్గాదేవి ఊరేగింపులో కోలాటం ఆడుతున్న మహిళలు


ఊరేగింపులో పాల్గొన్న నిర్వాహకులు

ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్‌: దుర్గామాత నిమజ్జన వేడుకలు బుధవారం కూడా కొనసాగాయి. దుర్గాదేవి విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. నారాయణపూర్‌లో నవదుర్గ యూత్‌ ఆధ్వర్యంలో ట్రాక్టర్లలో అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామ పురవీధుల్లో దుర్గాదేవి శోభాయాత్రలో మహిళలు మంగళహారతులిచ్చి మొక్కుకున్నారు. చెరువులు, వాగుల్లో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.


ముస్తాబాద్‌లో..

కాంగ్రెస్‌ అధికారంలోకి రాగానే రుణమాఫీ


రైతులతో మాట్లాడుతున్న కాంగ్రెస్‌ నాయకులు

ముస్తాబాద్‌: కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీని వెంటనే చేస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్‌లో గడపగడపకు కాంగ్రెస్‌ పార్టీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కాంగ్రెస్‌ నాయకులు ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతూ ఎకరాకు పంట సాయంగా క్వింటాలు ధాన్యానికి రూ.500 బోనస్‌ ఇస్తామన్నారు. కౌలు రైతులకు ఏడాదికి రూ.15 వేలను కాంగ్రెస్‌ అగ్రనాయకత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు అందించడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్‌ పార్టీ ఆరు గ్యారంటీలతో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం కొట్టుకుపోతుందన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు బుర్ర రాములు, ఎస్సీ సెల్‌ మండల అధ్యక్షుడు తలారి నర్సింలు, బాల్‌రెడ్డి, కొంరయ్య, దశరథం, తాళ్ల విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

కేటీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

• బీఆర్‌ఎస్‌ ఎన్నికల ప్రచారరథం ప్రారంభం


ప్రచార రథం ముందు బీఆర్‌ఎస్‌ నాయకులు

గంభీరావుపేట: మంత్రి కేటీఆర్‌ను ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు గంభీరావుపేట మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభించారు. సిరిసిల్ల నియోజకవర్గాన్ని కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి చేసిన కేటీఆర్‌ను ఆశీర్వదించాలని, మరింత అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సెస్‌ డైరెక్టర్‌ నారాయణరావు, నాయకులు కొమిరిశెట్టి లక్ష్మణ్‌, దయాకర్‌రావు, రాజారాం, వెంకటస్వామిగౌడ్‌, గంధ్యాడపు రాజు, శేఖర్‌గౌడ్‌, రాజేందర్‌, కమలాకర్‌రెడ్డి, లింగంయాదవ్‌, చేరాల వెంకటస్వామిగౌడ్‌ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో రద్దీ


వేములవాడ బస్టాండ్‌లో ప్రయాణికులు

వేములవాడఅర్బన్‌: వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం ప్రయాణికుల రద్దీ నెలకొంది. బతుకమ్మ, దసరా పండగకు ఇంటికి వచ్చిన ప్రజలు తిరుగు ప్రయాణం బాట పట్టారు. దాంతో వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌ ప్రయాణికులతో కిక్కిరిసింది. ప్రయాణికులు బస్సుల కోసం వేచి చూస్తున్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి ఆర్టీసీ బస్సులను నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్‌ మురళీకృష్ణ తెలిపారు.

‘ఆది’కి మద్దతు ఇస్తున్నట్లు తీర్మానం


తీర్మానపత్రాన్ని అందజేస్తున్న పటేల్స్‌ యూత్‌

రుద్రంగి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రుద్రంగి వాస్తవ్యులైన కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌కు మద్దతు ఇస్తామని మండల కేంద్రంలోని పటేల్స్‌ యూత్‌ సభ్యులు 70 మంది బుధవారం ఏకగ్రీవంగా తీర్మానం చేసి డీసీసీ కార్యదర్శులు తర్రె లింగం, కాంగ్రెస్‌ పార్టీ మండల ఉపాధ్యక్షులు తర్రె మనోహర్‌, నాయకులు ఎర్రం గంగనర్సయ్యలకు తీర్మానపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగుసార్లు వేములవాడ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా ఓటమి చెందినా ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎలాంటి ఇబ్బందులు కలిగినా పరిష్కరిస్తున్న బీసీ బిడ్డ ఆది శ్రీనివాస్‌కే తమ మద్దతు అని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించే వారికే ఓటు వేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పటేల్స్‌ యూత్‌ సభ్యులు, కాంగ్రెస్‌ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ప్రజాబలం ఎక్కువ


ప్రసాద్‌కు నియామకపత్రం అందజేస్తున్న ప్రకాశ్‌

సిరిసిల్లటౌన్‌: సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చే కాంగ్రెస్‌ పార్టీకే రానున్న ఎన్నికల్లో ప్రజాబలం ఎక్కువగా ఉందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్‌ అన్నారు. సిరిసిల్లలో పార్టీ బలోపేతం కోసం బుధవారం పలు పదవులను భర్తీ చేస్తూ నియామక పత్రాలను అందించి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ జయకేతనం ఎగురవేయడం తథ్యమన్నారు. పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి, మీడియా ఇన్‌చార్జిగా మ్యాన ప్రసాద్‌, మరో ప్రధాన కార్యదర్శిగా చొటపెల్లి వేణుగోపాల్‌, ఉపాధ్యక్షుడిగా అన్నల్‌దాస్‌ వేణుగోపాల్‌కు నియామకపు పత్రాలను అందించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వైద్య శివప్రసాద్‌, జిల్లా చేనేత సెల్‌ అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, నాయకులు గోలి వెంకటరమణ, కాముని నళినికాంత్‌, తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు జాలుగం ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి

తంగళ్లపల్లి: పోలీస్‌ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో రక్తదానం చేయాలని ఇల్లంతకుంట, తంగళ్లపల్లి ఎస్సైలు దాస సుధాకర్‌, వి.వెంకటేశ్వర్లు వేర్వేరు ప్రకటనల్లో పిలుపునిచ్చారు.

విశ్వకర్మ మనుమయ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ

తంగళ్లపల్లి: మండలంలోని చీర్లవంచ గ్రామంలో బుధవారం విశ్వకర్మ మనుమయ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ జక్కుల రవీందర్‌, ఎంపీటీసీ రేణుక, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజు, ఉపసర్పంచ్‌ బ్రహ్మం, సంఘం అధ్యక్షుడు మొగిలోజు విష్ణు, కాసర్ల తిరుపతి, మనోహర్‌, వెంకటయ్య, కోగిలంచ రాజయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

కనకతార నాటకం ప్రదర్శన

వీర్నపల్లి: మండల కేంద్రంలో బుధవారం కనకతార నాటక ప్రదర్శన శ్రీ దాసాంజనేయ భక్త కళా మండలి ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ఇందులోని పాత్రలు అందరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. బుద్రకాన్‌ వేషధారణకు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించాయి. పాత కళలను వెలికితీసిన భక్త మండలి వారికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.